ప్రజాశక్తి
తూర్పుగోదావరి
మంగళవారం
జూన్ - 18
2019
పేజీలు 12

# కొత్త కోర్సులతోనే భవిష్యత్తు

## ఒఎస్‌డి అండ్ ఆర్అండ్‌డి డైరెక్టర్ రవీంద్రనాథ్



సదస్సులో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమం ద్వారా కొత్త కోర్సులను నేర్చుకోవాలని ఒఎస్‌డి అండ్ ఆర్అండ్‌డి డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. స్థానిక జెఎన్‌టియుకె ప్రాంగణంలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం, భువనేశ్వర్‌లోని కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సిఈటీ)ల సంయుక్తాధ్వర్యంలో 'అడ్వాన్స్ మెంట్స్ ఇన్ మ్యానుఫ్యాక్చరింగ్ అండ్ వెల్డింగ్' అంశంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. టెక్విప్-3 నిధుల సహాయంతో ఈనెల 17వ తేదీ నుండి 22వ తేదీ వరకు వారం రోజుల పాటు ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నారు. పెట్రోలియం ఇంజనీరింగ్ అండ్ పెట్రోకెమికల్ ఇంజనీరింగ్ (పిఇపిసిఈ) సెమినార్ హాలులో ప్రారంభోత్సవ కార్యక్రమంలో రవీంద్రనాధ్ మాట్లాడారు. నాటి కాలంలో మ్యానుఫ్యాక్చరింగ్ అనేది సాంకేతిక పరిజ్ఞానంతో కూడినది కాదని, ప్రస్తుత కాలంలో అది ఆధునిక సాంకేతికతతో కూడిన మిషనరీని కలిగి ఉందన్నారు. ఇటువంటి శిక్షణా కార్యక్రమాలు అధ్యాపకులకు, పరిశోధక విద్యార్థులకు ప్రయోగాత్మక అనుభవం అందిస్తాయన్నారు. ఆధునిక వెల్డింగ్ పద్ధతులు, నానో మెటీరియల్స్ మొదలగు అంశాలలో ఆధునిక పద్ధతులపై శిక్షణనిచ్చేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదం చేస్తుందన్నారు.

ప్రొఫెసర్ పి.సుబ్బారావు మాట్లాడుతూ అధ్యాపకులు ముఖ్యంగా అవుట్ కమ్ బెస్ట్ ఎడ్యుకేషన్‌పై దృష్టిసారించి విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలన్నారు. మానుఫ్యాక్చరింగ్ అనేది విడి భాగాల అసెంబ్లింగ్ తర్వాత తుది ఉత్పత్తిని రూపొందించడమని పేర్కొన్నారు. ఇది ముఖ్యంగా డిజైన్ ఉత్పాదక కార్యకలాపాలలో పాల్గొన్న సంక్లిష్టతలను తగ్గించడంతోపాటు మొత్తం భాగం ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించొచ్చన్నారు. డాక్టర్. పి.ఎన్.రావు మాట్లాడుతూ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ ద్వారా నిర్వహించే శిక్షణా కార్యక్రమాలను అధ్యాపకులు సద్వినియోగపర్చుకోవాలన్నారు. ఆధునిక సాంకేతిక అంశాలను పాఠ్యాంశాలలో చేర్చి విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలన్నారు. ఇటువంటి వర్క్ షాపులను నిర్వహించడం ద్వారా అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులకు ప్రయోగాత్మక అంశాలపై అవగాహన కల్పిస్తున్న యుసిఇకె మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాన్ని ప్రత్యేకంగా అభినందించారు. ఫ్యాకల్టీ .డెవలప్మెంట్ పకార్యక్రమాల నిర్వహణకు మున్ముందు తమ వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వి.వరప్రసాద్ కార్యక్రమానికి వందన సమర్పణ చేశారు. ఈకార్యక్రమంలో విభాగాధిపతులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, జెఎన్టియుకె, అనుబంధ కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.